తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం – 15 – ఏప్రిల్ – 2026 | సంపుటి : 3 | సంచిక : 317 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## నియోజకవర్గాల పెంపుతో

# దక్షిణాదికి అన్యాయం



### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన

ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్లు తగ్గే ప్రమాదం ఉంది

మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది కోటాపై దెబ్బ

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం.. మేధావులు ఆలోచించాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రొరేటా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధి చెందిన రాష్ట్రాలను శిక్షించేలా ఈ నిర్ణయం ఉందని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ మరియు మహిళల రిజర్వుడు సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

మిగతా 2లో..

## ప్రధానికి రేవంత్ బహిరంగ లేఖ

- అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచన
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన
- మహిళా బిల్లుకు మద్దతు – పునర్విభజనతో ముడిపెట్టవద్దన్న విజ్ఞప్తి

2లో



## అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ నిరసన

కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు

125 అడుగుల విగ్రహం వద్ద బీఆర్ఎస్ నేతల నివాళులు

విగ్రహాన్ని బందీ చేశారంటూ కాంగ్రెస్‌పై ఆగ్రహం

అంబేద్కర్ ఆశయాల అమలుపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

అంబేద్కర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తీరాన ఉన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ భవన్ నుంచి భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన ఆయనతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండున్నరేళ్లుగా అంబేద్కర్ విగ్రహాన్ని బందీగా మార్చారని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ హెచ్చరికల తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ప్రపంచంలోనే అతిపెద్దదని కేటీఆర్ గుర్తు చేశారు. అంబేద్కర్ చెప్పిన "బోధించు, సమీకరించు, పోరాడు" సిద్ధాంతంతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## ఎస్సీ, ఎస్టీ హామీలపై కాంగ్రెస్‌పై విమర్శలు: కేటీఆర్

- డిక్లరేషన్ పేరుతో మోసం చేశారన్న ఆరోపణ
- హామీలు అమలు కాలేదని ఆగ్రహం
- ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులపై ప్రశ్నలు



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి తెలియజేయాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

మిగతా 2లో..

## రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ

- అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు
- అరైవ్–అలైవ్ కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపు
- ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొన్న కార్యక్రమం




**ఖమ్మం, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్, అంబేద్కర్ సర్కిల్ వద్ద ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీసు కమిషనర్ సునీల్ దత్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ ఆయన చూపిన సమానత్వం, న్యాయం మార్గం సమాజానికి ఎప్పటికీ ఆదర్శమని నేతలు పేర్కొన్నారు.

మిగతా 2లో..

## ఖమ్మంలో నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ

- గడప గడపకూ సంక్షేమ పథకాలను చేరవేయాలి
- నిప్పు తొక్కిన కోతుల్లా ప్రతిపక్షాల తీరుపై పొంగులేటి విమర్శలు
- రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే లక్ష్యం



**ఖమ్మం, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నాడు జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ మహోత్సవం కనులపండువగా జరిగింది. డీసీసీ అధ్యక్షులు సత్తయ్య గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల అలుపెరుగని కృషి, పోరాట ఫలితంగానే రాష్ట్రంలో ప్రజాపాలన సాధ్యమైందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యకర్తలు తాము పడిన కష్టాన్ని బాధ్యతగా మార్చుకుని, ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ రాకెట్ ఛేదనం

- చాదర్‌ఘాట్ పోలీసుల దాడిలో నిందితుడు అరెస్ట్
- బ్యాంక్ సీఆర్ఎంలో నకిలీ నోట్లు వెలుగు
- రూ.94,000 నకిలీ కరెన్సీ స్వాధీనం

2లో




## కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు
- మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనపై సీఎం వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ చరిత్రపై ఆధారాలతో స్పందన
- అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలపై సీఎం చేసిన వ్యాఖ్యలు అసత్యాలతో నిండివున్నాయని అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## నియోజకవర్గాల పెంపుతో

# దక్షిణాదికి అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టడం ద్వారా కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని రేవంత్ రెడ్డి గారు విమర్శించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, అయితే దాని ముసుగులో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడం సరికాదని అన్నారు. "దామాషా ప్రకారం 50 శాతం సీట్లు పెంచుతామని చెప్పడం ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుంది. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారు?" అని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. రాజ్యాధికారం సాధించడమే అంతిమ లక్ష్యమన్న అంబేద్కర్ ఆశయాలకు విఘాతం కలుగుతున్న తరుణంలో దళితులు, మేధావులు ఈ అంశంపై గంభీరంగా ఆలోచించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదని, ఇప్పటికే ఎస్సీ ఉపకులాల వర్గీకరణ మరియు కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని, ఇందుకోసం గద్దరన్న, అందెశ్రీ వంటి కళాకారులు తమ పాటలతో ప్రజల్లో చైతన్యం నింపారని స్మరించుకున్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే తమ ప్రజా ప్రభుత్వంలోనే దళిత, గిరిజన, మైనారిటీలకు మంత్రి పదవుల నుంచి అధికారుల నియామకాల వరకు అత్యున్నత ప్రాధాన్యత లభించిందని ఆయన ఉదాహరణలతో వివరించారు. సామాజిక అంతరాలను తొలగించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను' నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుందని అంబేద్కర్ బలంగా విశ్వసించారని, ఆ మార్గంలోనే తమ ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. ఇటీవల భర్తీ చేసిన 67 వేల ప్రభుత్వ ఉద్యోగాల్లో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీలకే దక్కాయని వెల్లడించారు. అలాగే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో మెజారిటీ ఇళ్లు దళితులకే కేటాయించామని, సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల కోసం రాజీవ్ గాంధీ అభయహస్తం కింద ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశానికి రెండు కళ్లలాంటి వారని, వారి ఆలోచనలే 'ప్రజాపాలన'కు దిక్సూచి అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు గత ప్రభుత్వ అప్పులు మరియు తప్పులను సరిదిద్దుతూనే, మరోవైపు అన్ని వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రజల కోసం అందిస్తున్న ఈ ప్రజాపాలనను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు. తెలంగాణ గడ్డపై అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని ఈ సభ ద్వారా సందేశమిచ్చారు.

## ప్రధానికి రేవంత్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** లోక్‌సభ నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్ బిల్లులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు బహిరంగ లేఖ రాశారు. కీలక అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ లేఖలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ, దాన్ని లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టవద్దని కోరారు. రెండు వేర్వేరు అంశాలను కలిపి అమలు చేయడం వల్ల అనవసర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

లోక్‌సభ నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే పునర్విభజన చేపడితే జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు నష్టపోతాయని అన్నారు.

అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని ప్రధాని మోదీని కోరారు. దేశ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమతుల్యతతో నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇలాంటి కీలక నిర్ణయాలపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సంపూర్ణ చర్చల అనంతరం నిర్ణయాలు తీసుకోవడం అవసరమని తెలిపారు.

లోక్‌సభ పునర్విభజన బిల్లు ద్వారా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా చూడాలని, దేశ సమగ్రతకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద కేటీఆర్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

అంబేద్కర్‌ను కేవలం మాటల్లో కాకుండా చేతల్లో గౌరవించాలనే ఉద్దేశంతో దళిత బిడ్డల కోసం 1000 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామని, రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి గౌరవించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కొనసాగించిన కేటీఆర్, గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత కుటుంబాలకు రూ.10 లక్షలు అందించగా, కాంగ్రెస్ మాత్రం రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సహా ఇతర హామీలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నివాళుల అనంతరం కేటీఆర్ మరియు ఇతర నేతలు విగ్రహం కింద ఉన్న మ్యూజియంను సందర్శించి అంబేద్కర్ జీవిత విశేషాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ హామీలపై కాంగ్రెస్‌పై విమర్శలు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు.

సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు విదేశాల్లో చదివే అవకాశం పొందారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇవ్వాల్సిన నిధులను ఇప్పటికీ విడుదల చేయలేదని ఆరోపించారు. ఏడు వేల మంది విద్యార్థులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతుందని విమర్శించారు. సామాజిక న్యాయం విషయంలో కాంగ్రెస్ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లోకి వెళ్లి నిజాలు తెలియజేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టాం

(మొదటి పేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి నైతిక హక్కు లేదని రామచందర్ రావు విమర్శించారు. దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ మహిళా సాధికారతకు అవసరమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కీలక నిర్ణయాలను వాయిదా వేసిందని ఆరోపించారు.

యూపీఏ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వలేదన్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆ బిల్లుకు బీజేపీ, ఎన్డీయే పక్షాలు మద్దతు ఇచ్చాయని, కాంగ్రెస్ మిత్రపక్షాలే దాన్ని అడ్డుకున్నాయని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. దక్షిణాది ప్రాతినిధ్యం విషయంపై సీఎం వ్యాఖ్యలు అవాస్తవమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గంలో నిర్మలా సీతారామన్, ఎస్. జైశంకర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి దక్షిణాది నేతలు ఉన్నారని గుర్తుచేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ పార్టీ అవసరంలేని భయాందోళనలు సృష్టిస్తోందని అన్నారు. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనలు రాకముందే ప్రజల్లో అనుమానాలు కలిగించడం సరైంది కాదని పేర్కొన్నారు. జీఎస్డీపీతో పునర్విభజనను ముడిపెట్టడం అనవసరమని అభిప్రాయపడ్డారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ చరిత్రను కూడా ఆయన ప్రస్తావించారు. అంబేద్కర్‌ను గతంలో కాంగ్రెస్ అవమానించిందని ఆరోపించారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం అంశాలపై కాంగ్రెస్ మాట్లాడే అర్హత లేదని, అది కేవలం అవకాశవాద రాజకీయాలకు మాత్రమే పరిమితమైందని రామచందర్ రావు విమర్శించారు.

# ఖమ్మంలో నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ మహోత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు, ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి గారు మరియు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారు ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తోందని నేతలు స్పష్టం చేశారు. పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే తపనతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని, ఈ విజయ పరంపరను కార్యకర్తలు గడప గడపకూ వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని వారు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన ప్రతిపక్ష పార్టీల తీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన వారు నేడు అధికారం లేకపోయేసరికి నిప్పు తొక్కిన కోతుల్లా ప్రవర్తిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అధికారం పోయిందన్న అక్కసుతో చేస్తున్న మాయ మాటలను ప్రజలు ఎవరూ నమ్మే స్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టేలా, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తే మళ్లీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వినూత్నమైన సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పొంగులేటి వివరించారు. ఈ రోజు జరిగిన నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణతో జిల్లాలో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొందని, ఇది రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పాలన అందించేందుకు దోహదపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బలమైన కోట అయిన ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. ఈ భారీ బహిరంగ సభ తరహాలో జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యులు రాందాసు నాయక్ గారు, మట్టా రాగమయి దయానంద్ గారు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యవర్గ సభ్యులకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తల నినాదాలతో ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయ పరిసరాలు మారుమోగాయి. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రచార అస్త్రంగా చేసుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులు నిశ్చయించుకున్నాయి.

# రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగం ద్వారా దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

అనంతరం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. వాహనదారులు ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీసులు ఉన్నా లేకపోయినా బాధ్యతగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి తన కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలని, వేగ నియంత్రణ పాటించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. రోడ్డు భద్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం గంభీరంగా, అవగాహన కల్పించే విధంగా సాగింది.

## హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ రాకెట్ ఛేదనం

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో నకిలీ కరెన్సీ రాకెట్‌ను చాదర్‌ఘాట్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో 33 ఏళ్ల అహ్మద్ పాషాను అరెస్ట్ చేసి విచారణ కొనసాగిస్తున్నారు. మలక్‌పేట్‌లోని కోటక్ మహీంద్రా బ్యాంక్ సీఆర్ఎంలో రూ.5,000 విలువైన నకిలీ ₹500 నోట్లు బయటపడటంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో దర్యాప్తు ప్రారంభమైంది. పోలీసుల విచారణలో నిందితుడు అహ్మద్ పాషా నకిలీ కరెన్సీని సర్క్యులేషన్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నించినట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి మొత్తం రూ.94,000 విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి, మరెవరెవరితో సంబంధాలు ఉన్నాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నగరంలో నకిలీ కరెన్సీ నెట్వర్క్‌ను పూర్తిగా ఛేదించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రజలు కూడా నగదు లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద నోట్లు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పబ్లిక్ వైఫై మోసాలపై హెచ్చరిక

- **తెలంగాణ పోలీసులు అప్రమత్తం**
- **ఉచిత వైఫై వలలో చిక్కుకుంటున్న వినియోగదారులు**
- **బ్యాంకింగ్ వివరాల దొంగతనం పెరుగుతున్న ఘటనలు**
- **సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి**

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉచిత పబ్లిక్ వైఫై వాడకం వల్ల సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా పబ్లిక్ వైఫై ద్వారా ఆర్థిక లావాదేవీలు చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు.

పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లు సురక్షితంగా ఉండకపోవడం వల్ల హ్యాకర్లు వినియోగదారుల వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలను సులభంగా దొంగిలించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ పబ్లిక్ వైఫై ఉపయోగించి బ్యాంకింగ్ లావాదేవీలు చేయవద్దని సూచించారు. అపరిచిత వైఫై నెట్‌వర్క్‌లకు కనెక్ట్ అవ్వడం ద్వారా ఫిషింగ్, డేటా దొంగతనం వంటి సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పబ్లిక్ నెట్‌వర్క్‌లపై ఉపయోగించకూడదని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే స్పందించాలని కోరారు. సైబర్ మోసాలకు గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేగంగా స్పందిస్తే నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. డిజిటల్ ప్రపంచంలో భద్రత అత్యంత ముఖ్యమని, ప్రతి వినియోగదారు జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 15- ఏప్రిల్ 2026




# అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా

- బేతుపల్లిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహణ.

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

బేతుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత, మహామేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు, దేశానికి చేసిన విశిష్ట సేవలను గ్రామ ప్రజలకు వివరించారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పోషించిన కీలక పాత్రను గుర్తుచేస్తూ, ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహానుభావుడిగా కొనియాడారు.

సామాజిక అసమానతల నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన పోరాటం అపూర్వమని, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ "విద్య పొందండి, సంఘటితంగా ఉండండి, పోరాడండి" అనే ఆయన సందేశాన్ని గుర్తుచేశారు. సమానత్వం, సామాజిక న్యాయం, స్వాభిమాన భావనల కోసం ఆయన చూపిన మార్గం నేటికీ అందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి దిశానిర్దేశం చేస్తూ, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.



# సత్తుపల్లిలో అంబేద్కర్‌కు ఘన నివాళులు

- సమానత్వం సాధనకు ఆయన ఆశయాలే మార్గం
- ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయానికి ప్రాతినిధ్యం వహించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్‌లో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యురాలు మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమలపాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నారావు, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహ రావు, పట్టణ మరియు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# సమ్మె బాటలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు

- 7వ రోజుకు నిరవధిక సమ్మె
- సేవా నియమాల అమలు కోరుతూ నిరసన

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరింది. రాష్ట్ర టీవీఏఈ సంయుక్త చర్య కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు ఆర్టిజన్, అన్‌మాన్, పనికి చెల్లింపు విధానంలో ఉన్న కార్మికులు విధులను బహిష్కరించి సత్తుపల్లి డివిజన్ కార్యాలయం ముందు టెంటు వేసుకొని తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి డివిజన్ చైర్మన్ గుగులోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, శాఖలో రెండు విధాల సేవా నియమాలు అమలు చేయడం వల్ల ఆర్టిజన్ కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. పాతకాలపు నియమాలను కొనసాగిస్తూ తమపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఉచిత విద్యుత్, గృహ వినియోగం, పరిశ్రమలకు నిరంతరాయ సరఫరా అందించడంలో తమ పాత్ర కీలకమైనప్పటికీ తగిన గుర్తింపు దక్కడం లేదని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు.

**డిమాండ్లు :** ఒకే సంస్థలో ఒకే విధమైన సేవా నియమాలు అమలు చేయాలి. అన్‌మాన్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలి. పనికి చెల్లింపు విధానంలో ఉన్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి. ఆర్టిజన్ కార్మికులను స్థిర ఉద్యోగులుగా మార్చాలి. 2026 వేతన సవరణ అమలు చేయాలి అని అన్నారు. ఈ సమ్మెలో రాందాస్ నాయక్, నాగేశ్వరరావు, శ్రీను, నర్సింహారావు, కనకదుర్గ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.





# సత్తుపల్లిలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

- భారీ ర్యాలీ... విగ్రహానికి నివాళులు అర్పించిన
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సత్తుపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టాండ్ సెంటర్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ జయంతి నినాదాలతో ప్రాంతం మార్మోగించారు. అనంతరం సండ్ర వెంకట వీరయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక కుల నాయకుడు కాదని, దేశానికి మార్గదర్శకుడైన మహానేత అని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో తన ఎమ్మెల్యే హయాంలో 37 లక్షల రూపాయల వ్యయంతో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం రావడం తనకు గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ చూపించిన మార్గంలో నడుస్తూ సమాన హక్కులు అందరికీ కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అసమానతలపై అక్షర యుద్ధం చేసిన మహాయోధుడు అంబేద్కర్

- ఏనుగుల రాకేష్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

**హన్మకొండ,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):**

భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా గ్రేటర్ వరంగల్ 50వ డివిజన్ జులైవాడ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అసమానతలపై అక్షర యుద్ధం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆయన జయంతి పండుగ వాతావరణంలో జరుగుతుండటం, పార్టీలకతీతంగా అన్ని వర్గాల నాయకులు ఆదర్శంగా తీసుకునే నాయకుడిగా అంబేద్కర్ నిలిచారని తెలిపారు.



అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడానికి జీవితాంతం కృషి చేసిన అంబేద్కర్ స్ఫూర్తితో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బీఆర్ఎస్ యువ నాయకులు అంకం లక్ష్మణ్, కృష్ణమూర్తి పాత్రను ప్రశంసించారు.

స్వాతంత్ర్య భారతదేశానికి ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అందించి, ప్రజలకు అనేక హక్కులు కల్పించి, బాధ్యతలను సూచించిన అంబేద్కర్ అందరివాడని, ఆయనను ఏ ఒక్క వర్గానికే పరిమితం చేయలేమని స్పష్టం చేశారు.అంకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నెక్కొండ కిషన్, డివిజన్ అధ్యక్షుడు కోటేశ్వర్, నాయకులు వీపీ రెడ్డి, కృష్ణమూర్తి, మహేందర్ రెడ్డి, గుండెకాని మహేందర్, మాతంగి రమేష్, గునికంటి చందర్, బిక్షపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సీఎం రేవంత్ రెడ్డి కృషి ఫలితం
- పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం దేశంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు.కాప్రా డివిజన్ గాంధీ నగర్‌లో గాంధీ నగర్ యూత్ & వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితోనే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా దళిత వర్గాల్లోని అన్ని కులాలకు సమాన న్యాయం జరిగిందని తెలిపారు. ఎన్నో అడ్డంకులు ఉన్నప్పటికీ సీఎం ఈ కీలక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు.అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్‌ను మరియు భారత రాజ్యాంగాన్ని అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గాంధీ నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.





# వాడవాడలలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

- కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి
- సిఐటియు పిలుపు

**కీసర, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర మండలంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని అన్నారు.భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కార్మిక హక్కులను పరిరక్షించాలంటే కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు.రాంపల్లి, దాయరా, జాఫర్‌గూడ, బండ్లగూడ, గోధుమకుంట, కరీంగూడ, దమ్మైగూడ ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతపల్లి అశోక్, సిలివేరి సుదర్శన్‌తో పాటు నాగారం, దమ్మైగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు భాగ్యమ్మ, పోచయ్య, మహంకాళమ్మ, శీను, శ్రీకాంత్, జంగయ్య, జాన్ మోషె, రాణి, నిఖిల, అశ్విని, దేవేందర్, మహేష్, హరి, కొండల్, కృష్ణ, జయమ్మ, నరసింహ, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు

**నాచారం, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

### లండన్ యూనివర్సిటీలో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా దేశ విదేశాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి.లండన్‌లోని డా. బి. ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ లో అంబేద్కర్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని, సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అంబేద్కర్ జయంతిని జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.అంబేద్కర్ లండన్‌లో గడిపిన కాలం ఆయన జీవితంలో కీలక దశగా నిలిచిందని తెలిపారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో ఆర్థిక శాస్త్రం అభ్యసించడంతో పాటు గ్రేస్ ఇన్ లో న్యాయ విద్యను అభ్యసించి బారిస్టర్‌గా శిక్షణ పొందారని వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థపై లోతైన పరిశోధనలు చేసి "రూపాయి సమస్య" వంటి గ్రంథాలను రచించారని చెప్పారు. యూరప్ ప్రజాస్వామ్య భావనలు



ఆయన ఆలోచనలను ప్రభావితం చేసి, అణగారిన వర్గాల కోసం పోరాడే సంకల్పాన్ని బలపరిచాయని పేర్కొన్నారు.

### నాచారం డివిజన్‌లో

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో కూడా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాఘవేంద్ర నగర్, నాచారం, ఎర్రగుంట ప్రాంతాల్లో బిఆర్ఎస్ నేతలు పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాఘవేంద్ర నగర్‌లో బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొనగా, నిర్వాహకులు సంజన్న, దేవులపల్లి యాదగిరి, మురళి తదితరులు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. ఎర్రగుంటలోని ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్ మరియు అంబేద్కర్ నగర్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో కూడా భాగస్వామ్యమయ్యారు.

అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని నాయకులు పిలుపునిచ్చారు.

### మీర్పేట్ హెచ్.బి కాలనీ డివిజన్

అంబేద్కర్ జయంతి వేడుకలు

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటూ ఆయన సేవలను స్మరించుకుంటారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి దేశానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఈసీఐఎల్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు

- బొంతు రాంమోహన్,
- బొంతు శ్రీదేవి యాదవ్ నివాళులు

**కుషాయిగూడ, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఈసీఐఎల్‌లో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి సందర్భంగా విస్తృతంగా వేడుకలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం లో చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్, నగర మాజీ మేయర్ బొంతు రాంమోహన్ మరియు బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అపూర్వమైన సేవలు అందించారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణలో ఆయన చూపిన మార్గం నేటికీ మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు.అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని వారు స్మరించుకున్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్య, క్రమశిక్షణ, సేవాభావంతో సమాజ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంబేద్కర్ స్ఫూర్తితో చదువుకోండి – ఎదగండి

- వేంసూరు ఎస్సీ వసతిగృహంలో అంబేద్కర్ జయంతి.

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వేంసూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వసతిగృహ సంక్షేమ అధికారి డాక్టర్ తిమ్మిడి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. దేశ అభివృద్ధి కోసం ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ, సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం పట్ల ఆయన చూపిన మార్గదర్శకత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని వివరించారు. "చదువుకోండి - ఎదగండి" అనే అంబేద్కర్ సందేశాన్ని గుర్తు చేస్తూ, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి వ్యక్తిగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# వెల్టూర్ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**పెద్దమందడి,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామపంచాయతీ ఆవరణంలో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు అంబేద్కర్ జీవిత గాధను, ఆయన సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సమాన హక్కులు, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి గురించి వివరించారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల సందర్భంగా గ్రామంలో ఐక్యత, సోదరభావం ప్రతిఫలించాయి. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరణలో పెట్టాలని వక్తలు సూచించారు.ఈ కార్యక్రమం గ్రామంలో సామరస్య వాతావరణాన్ని మరింత బలోపేతం చేసింది. వేడుకల్లో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, గ్రామ ప్రజలు, నాయకులు, యువత, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ దుకాణాల వేలం ఆపాలని సిపిఎం వినతి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం
- లబ్ధిదారులకే కిరాయిలకు ఇవ్వాలని డిమాండ్



**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ స్కీమ్ పరిధిలోని వాణిజ్య దుకాణాల వేలం అమ్మకాలను నిలిపివేయాలని సిపిఎం నేతలు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు.సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. శ్రీనివాసులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాల్లో పేద, బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకోవాలని అన్నారు. కాలనీల నిర్వహణ భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, దుకాణాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించి వచ్చిన నిధులను జిల్లా కలెక్టర్, కాలనీ సొసైటీల సంయుక్త ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఆ నిధులపై వచ్చే వడ్డీని కాలనీల మెయింటెనెన్స్‌కు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిపిఎం నేతలు తమ వినతిపత్రంలో జిల్లాలోని 12 డబుల్ బెడ్‌రూమ్ కాలనీలలో 892 దుకాణాలను ఏప్రిల్ 15, 17 తేదీల్లో వేలం వేయాలన్న నిర్ణయం ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని తెలిపారు. దుకాణాలను కిరాయికి ఇస్తే వచ్చే ఆదాయంతో లిఫ్టులు, ఇతర సదుపాయాల నిర్వహణ సులభమవుతుందని, అమ్మకాల వల్ల భవిష్యత్తులో వచ్చే ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.అలాగే కాలనీల మరమ్మతులు, అభివృద్ధి పనులు, నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ఎస్టీపీలు వంటి సదుపాయాల నిర్వహణను కూడా ప్రభుత్వమే చేపట్టాలని సిపిఎం బృందం వినతిపత్రంలో కోరింది.

# వనపర్తి జిల్లాలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా

**వనపర్తి,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి .ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పాల్గొని మాట్లాడుతూ, అంబేద్కర్ ఎన్నో కష్టాలు ఎదుర్కొని దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించే రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు.దేశ ప్రజలందరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ముందు ప్రతి పౌరుడు సమానుడని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటేనే దేశంలో శాంతి, సౌభాగ్యం నెలకొంటాయని అన్నారు.తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ వరప్రసాద్ రావు మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యంత దృఢమైన రాజ్యాంగాల్లో భారత రాజ్యాంగం ఒకటని, ప్రజాస్వామ్య పరిపాలనలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్‌మాట్లాడుతూ.. రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించడం ద్వారా వారి సాధికారతకు దోహదపడిందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రూపొందించడం మాత్రమే కాకుండా దాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.అసోసియేషన్ సభ్యులు ప్రశాంత్ గౌడ్, భరత్, రాకేష్, ప్రభాకర్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ హక్కులు, బాధ్యతలను సమానంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వ వ్యవస్థ సమర్థంగా నడుస్తుందని తెలిపారు. మండల విద్యాధికారులు మద్దిలేటి, జయరాములు మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో రాజ్యాంగబద్ధంగా అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు.ఈ



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులందరికీ అసోసియేషన్ తరపున జిల్లా అధ్యక్షుడు ఎస్ వరప్రసాద్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజరాజేశ్వర గార్డెన్స్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు

- ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని కార్మికులకు మద్దతు ప్రకటించారు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** రాజరాజేశ్వర గార్డెన్స్‌లో కంటోన్మెంట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తున్న కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.అంబేద్కర్ సమాజంలోని అంటరానితనం, అస్పృశ్యత వంటి సమస్యలను స్వయంగా అనుభవించి, వాటి నిర్మూలన కోసం రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. ఆయనను కేవలం రిజర్వేషన్లకే పరిమితం చేయడం సరైంది కాదని, సమసమాజ స్థాపనకు మార్గదర్శకుడని పేర్కొన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తరువాత కూడా కుల వివక్ష పూర్తిగా తొలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సమానంగా అందరికీ చేరాలని అంబేద్కర్ ఆశయమని తెలిపారు. పేదల కు గూడు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు.కంటోన్మెంట్ కార్మికులకు కంపాషినేట్ అపాయింట్మెంట్ ఇవ్వాలని డిమాండ్ సమంజసమని, మురికి కాలువలు శుభ్రం చేసే కార్మికులు అనారోగ్యానికి గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కూడా ఈ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారని గుర్తుచేశారు. షాపుల లీజులు ముగిసిన కారణంగా చిన్న వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం తగదని విమర్శించారు. పేదలపై అన్యాయం జరిగితే తాను ముందుండి పోరాడతానని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.అంబేద్కర్ ఆశయాలు ఇంకా పూర్తిగా అమలు కాలేదని, వాటి సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# మల్లాపూర్‌లో డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం

- భవాని నగర్‌లో పనులు ప్రారంభం
- బస్తీ బాటలో ప్రజల సమస్యలు తెలుసుకున్న నాయకులు

**మల్లాపూర్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. "బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా భవాని నగర్‌లోని స్ట్రీట్ నెం. 3, 15 ప్రాంతాలను సందర్శించిన స్థానిక నాయకుడు నెమలి అనిల్ కుమార్, అక్కడి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు .ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ స్తంభించడంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వివరించారు.సమస్యపై వెంటనే స్పందించిన అనిల్ కుమార్, సంబంధిత అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టేలా చేశారు.



అనంతరం అధికారులతో కలిసి ప్రదేశాన్ని పరిశీలించిన ఆయన, భవాని నగర్‌లో కొత్త డ్రైనేజీ పైపుల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రాథమిక వసతులు అందించడంలో తాను ఎప్పుడూ ముందుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో అంబేద్కర్ జయంతి న్యాయ విజ్ఞాన సదస్సు




- రాజ్యాంగ విలువలు సమాజానికి మార్గదర్శకం
- న్యాయమూర్తులు

**కుషాయిగూడ, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కుషాయిగూడలోని జిల్లా కోర్టులో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.సదస్సుకు చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు అధ్యక్షత వహించి అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. రాజ్యాంగ పితామహుడిగా ఆయన దేశానికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రజల జీవితాల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నయ్య మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో న్యాయబద్ధమైన అవగాహన పెంపొందించడంలో ఇటువంటి సదస్సులు కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు దుర్గ ప్రసాద్, ప్రశాంతి, రాజు లాడే, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.సదస్సులో పాల్గొన్నవారు అంబేద్కర్ ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకమని, రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడు గౌరవించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# సత్తుపల్లి డిపోలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి డిపోలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిపో మేనేజర్, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి అందరూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని కేక్ కట్ చేసి జయంతి వేడుకలను మరింత ఉత్సాహంగా జరిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, వెల్ఫేర్ కమిటీ సభ్యులు పద్మావతి, సైదిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిపో కమిటీ సభ్యులు కల్లేపల్లి సర్వేశ్వరరావు, పి. రాఘవులు, ముత్తయ్య, బాలస్వామి, వెంకటయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



## పెద్దమందడిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటం ఆవిష్కరణ

**పెద్దమందడి,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ హై స్కూల్ సమీపంలో పార్లమెంట్ భవనం మరియు అంబేద్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు.ఈ చిత్రపటాలను 1992 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పానుగంటి కుర్మయ్య స్వంతంగా రూ.20,000/రూపాయల వ్యయంతో వేయించారు.అనంతరం గ్రామ సర్పంచ్ గంగమ్మ రవి చేతుల మీదుగా అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు.అంబేద్కర్ ఆశయాలను అందరూ ఆచరించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఐ సత్యారెడ్డి, కొమ్ము వెంకటస్వామి, సేనాపతి, గ్రామ సెక్రటరీ దిలీప్ రెడ్డి, సింగిరెడ్డి కురుమూర్తి, రాఘవేంద్ర, రామాంజనేయులు, వార్డు సభ్యులు కొమ్ము బ్రహ్మయ్య, కొమ్ము విష్ణు, కొమ్ము సత్యనారాయణ, కొమ్ము శివ కుమార్, గుడిసె మల్లేష్, జంగం శివ, స్వామి తదితరులు పాల్గొ



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## రాజ్యాంగమే ప్రజా స్వామ్యానికి బలమైన కవచం: సీపీఐ

- అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
- ఈసీఐఎల్‌లో ఘనంగా నిర్వహణ

**కుషాయిగూడ, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేది రాజ్యాంగమేనని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వియస్. బోస్ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ దేశానికి సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలను అందించిన మహానుభావుడని కొనియాడారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాలు రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. సమానత్వం, స్వేచ్ఛ, సెక్యులరిజం వంటి ప్రాథమిక విలువలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.మత పరమైన రాజకీయాలు, విభజనాత్మక ధోరణులు దేశ ఏకత్వానికి ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడటం అంటే దేశాన్ని కాపాడటమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ.దామోదర్ రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ నాయకులు ఎస్. శంకర్ రావు, టి. సత్య ప్రసాద్, నారా నర్సింహా, బాబురావు, నర్సింహా రావు, గిరిబాబు, రాజ్ కుమార్, మహేష్, అజీమ్ పాషా, అశోక్, లక్ష్మణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్–మల్కాజిగిరిలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**



భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్‌లో జిల్లా స్థాయిలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు హక్కులు కల్పించిందని తెలిపారు. కేవలం విగ్రహాలు ఏర్పాటు చేయడం కాకుండా ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. రాజ్యాంగంలోని రిజర్వేషన్ల ద్వారా సమాజంలో సమానత్వం ఏర్పడిందని, బడుగు బలహీన వర్గాల వారు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారని అన్నారు.సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీఎస్ఎస్ కళాకారులు ఆలపించిన అంబేద్కర్ గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహక చెక్కులు అందజేసి, దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వారికి 'దళిత రత్న' అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## చిన్నపెండ్యాలలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**చిల్పూర్,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డీజే ధ్వనులతో ఉత్సాహభరితంగా సాగిన ఈ ర్యాలీలో "జై భీం" నినాదాలతో గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి తరతరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీల రాజు, బత్తుల రాజన్ బాబు, తాళ్లపల్లి శివ కుమార్, రామడుగు బుచ్చి కొమురయ్య, కొత్తపల్లి యాకరాజు, ఇల్లందుల యాదగిరి, గడ్డమీది మహేందర్, ఇల్లందుల హరిబాబు, చుక్క రాజేష్, బొల్లెపాక శ్రీనివాస్, గడ్డమీద ఎల్లయ్య, గడ్డమీద సురేష్, ఇల్లందుల విజయ్, ఇల్లందుల శ్రీకాంత్, ఇల్లందుల రాజు, బొల్లెపాక రమేష్, చుక్క రాంబాబు, చుక్క మార్కు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా! నినాదాలతో నిండిన హుజరాబాద్

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** హుజరాబాద్ పట్టణం అంబేద్కర్ జయంతోత్సవాల సందడి మధ్య మిన్నంటింది. అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగి, పట్టణం మొత్తం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది.
మున్సిపల్, పోలీస్, రవాణా శాఖల అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమ ప్రాంగణం నినాదాలతో మార్మోగగా, అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ పాల్గొన్న వారిలో ఉత్సాహం వెల్లివిరిసింది.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వానికి బాటలు వేసిన మహానుభావుడని కొనియాడారు. దళిత, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.
వేడుకల్లో వివిధ శాఖల అధికారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమం ముగింపులో ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని ప్రతిజ్ఞ చేశారు.



## 7వ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల సమ్మె.. "ఓకే సంస్థ–ఓకే రూల్"తో హుజరాబాద్‌లో భారీ ర్యాలీ

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** హుజరాబాద్‌లో తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్టిసన్ అన్‌మ్యాన్ కార్మికుల సమ్మె ఈరోజుతో 7వ రోజుకు చేరింది. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ కార్మికులు సమ్మెను మరింత ఉధృతం చేశారు.
ఈ సందర్భంగా కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. "ఓకే సంస్థ-ఓకే రూల్" అంటూ నినాదాలతో ర్యాలీ మార్మోగింది. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేపట్టాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ (ప్రస్తుతం అమలులో ఉన్న O&M రూల్స్)ను ఆర్టిసన్లకు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు.
అదేవిధంగా టీజీఎన్‌పీడీసీ సంస్థలో పని చేస్తున్న అన్‌మ్యాన్ వర్కర్లను ఆర్టిసన్లుగా విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 2016 డిసెంబర్ 6కు ముందు అర్హతలతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆర్టిసన్‌లుగా గుర్తించాలని, పీస్‌రేట్ కార్మికులకు జీఓ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.




2026 పీఆర్‌సీ (వేతన సవరణ)ను వెంటనే అమలు చేయాలని, విద్యా అర్హతల ప్రకారం కన్వర్షన్ చేసినా ప్రభుత్వంపై అదనపు భారం ఉండదని కార్మికులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కంపెనీ రీజినల్ సెక్రటరీ పలవేణి రవి, జిల్లా సెక్రటరీ పంజాల శ్రీనివాస్, కర్ర సమ్మిరెడ్డి, తొండగట్టయ్య, విక్రమ్ రెడ్డి, బత్తుల రాజు, ట్రాన్స్‌కో కార్మికులు లక్ష్మణ్, శ్యామ్, మహిళా కార్మికులు సౌమ్య, సృజన, పర్వీన్ బేగం, హనుమాన్ కార్మికులు వెంకటేశు, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.
డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులు

- ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన జాగృతి

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణ చౌరస్తా వద్ద ప్రత్యేక కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఏసీబీ మాధవి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది.
అనంతరం పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించగా, వాహనదారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలపై వివరిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. "అరైవ్ అలైవ్" అనే సందేశంతో వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సురక్షిత ప్రయాణమే కుటుంబాలకు ఆనందం తెస్తుందని ఆమె పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకున్నారు.






## బీఆర్ఎస్ నేత వేణుకు గాయం.!

- పరామర్శించిన సండ్ర.
- ఆరోగ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్న నాయకులు

**సత్తుపల్లి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టణంలోని అవని వెంచర్‌లో బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు పర్వతనేని వేణు భుజానికి గాయం కావడంతో, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆయనను పరామర్శించారు. విషయం తెలుసుకున్న వెంటనే సండ్ర వెంకట వీరయ్య వేణు నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, టౌన్ పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ, నాయకులు అద్దంకి అనిల్, చంద్ పాషా, వల్లభనేని పవన్, గుండ్ర రఘు, మేకల నరసింహారావు, మరికంటి శ్రీను, చల్లపల్లి సాంబ, జొన్నలగడ్డ శ్రీను, చింతోజు మధు, అక్షింతల చంటి, కనూరి శ్రీనివాసరావు, రాగం వసంతరావు, జొన్నలగడ్డ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డీసీపీ ఇందిరా చేతులమీదుగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహణ

**నేరేడ్‌మెట్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడ్మిన్ డీసీపీ ఇందిరా ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశానికి అంబేద్కర్ అందించిన సేవలు అమూల్యమని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. రాజ్యాంగ విలువలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.



## ఇంటర్ ఫలితాల అనంతరం విద్యార్థి అదృశ్యం

- మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్...
- మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన 17 ఏళ్ల యువకుడు



**జవహర్ నగర్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీ నగర్ ప్రాంతంలో ముత్తుస్వామి కాలనీ, ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేస్తోంది. పాత్లవత్ గోపాల్ కుమారుడు శ్రీ చరణ్ (17) ప్రస్తుతం ఈసీఐఎల్‌లోని న్యూ చైతన్య కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఏప్రిల్ 12,న మధ్యాహ్నం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో శ్రీ చరణ్ మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తెలిసింది. ఈ విషయం వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన అదే రోజు మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా వెతికినా ఎటువంటి సమాచారం దొరకలేదు. దీంతో శ్రీ చరణ్ తండ్రి గోపాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.విద్యార్థి ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## అల్వాల్ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

**పెద్దమందడి,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు)** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల్ గ్రామంలో మంగళవారం ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని హైకోర్టు అదనపు న్యాయవాది డి. హంసు వర్మ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి కొమ్ము వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ రాజమహేందర్ రెడ్డి, డి మహేష్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ సుజాత భీమన్న, ఎం వెంకట్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ దేశానికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపారమని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వాన్ని సాధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.విద్య ద్వారానే వ్యక్తిగత మరియు సామాజిక అభివృద్ధి సాధ్యమని, యువత చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సందేశాన్ని గుర్తుచేశారు.రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప దార్శనికుడిగా అంబేద్కర్ నిలిచారని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర అపూర్వమని పేర్కొన్నారు.డి మహేష్ మాట్లాడుతూ.. అంబేద్కర్ జీవితాంతం సమానత్వం కోసం పోరాడిన గొప్ప నాయకుడని అన్నారు.చిన్ననాటి నుండి ఎన్నో కష్టాలను ఎదుర్కొని విద్య ద్వారా ఎదిగి దేశానికి సేవ చేసిన మహనీయుడని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు.కార్యక్రమం ముగింపులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## పామిరెడ్డిపల్లిలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**పెద్దమందడి,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అపారమని తెలిపారు.విద్య ద్వారానే వ్యక్తిగతంగా మరియు సమాజ పరంగా అభివృద్ధి సాధ్యమని, యువత చదువుపై దృష్టి సారించాలని సూచించారు.అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టి సమాన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల శ్రీశైలం, మాజీ సర్పంచ్ సిద్దయ్య, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ కార్మికులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.



## రక్తదానంతో అంబేద్కర్‌కు ఘన నివాళి

- **జమ్మికుంటలో సేవా స్ఫూర్తి వెల్లివిరిసింది**

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జమ్మికుంటలో సేవా స్ఫూర్తి వెల్లివిరిసింది. అబాది జమ్మికుంటలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రజల విశేష స్పందనతో విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని స్వయంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కేవలం మాటల్లోనే కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా ఆచరణలో పెట్టడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. సమాజ సేవలో యువత ముందుండాలని, అవసరమైన వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలు కాపాడే గొప్ప అవకాశమని తెలిపారు.

ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నిర్వాహకులను అభినందిస్తూ, పట్టణ ప్రజలకు అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు మైస శిరీష రవి, కోలుగురి సురంజన్, కోలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, అజయ్ రావు, భోగ తదితరులు పాల్గొన్నారు.



## జమ్మికుంటలో అంబేద్కర్ జయంతి ఘనంగా..

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ కుమార్ నివాళులు

- **"బోధించు–సమీకరించు–పోరాడు" ఆశయాలతో ముందుకు సాగాలి: నాయకుల పిలుపు**

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ కలిసి పాల్గొని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావి, న్యాయశాస్త్ర కోవిదుడు, భారత రాజ్యాంగ రూపశిల్పి అని కొనియాడారు. అంటరానితనం, అసమానతల నిర్మూలన కోసం "బోధించు, సమీకరించు, పోరాడు" అనే నినాదంతో సమాజాన్ని చైతన్యపరిచిన మహా సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

అదే విధంగా కొత్తపల్లి, ధర్మారం ప్రాంతాల్లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో కూడా చైర్మన్ పాల్గొని నివాళులు అర్పించారు. అంబేద్కర్ ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడని, భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత నాయకుడని కొనియాడారు.

ఈ కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు పోలు బిక్షపతి, పోల్నేని వేణు, కోలకానీ రాజు, పోల్నేని అజయ్, బత్తుల లక్ష్మణ్, గుర్రం పరశురామ్, చింతల శ్రీనివాస్, కుతటి తిరుపతి, బొద్దుల రవీందర్, పొడేటి రామస్వామి, దేశిని కోటి, వీరేశలింగం అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరివాడు

- **వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**హన్మకొండ,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.





అనంతరం జరిగిన సభలో మాట్లాడిన ఆమె అంబేద్కర్ ఒక వర్గం, కులం, మతానికి పరిమితమైన నాయకుడు కాదని, దేశంలోని ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన కల్పించిన హక్కులే దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల వల్లనే సమాజంలో అణగారిన వర్గాలు వెలుగులోకి వచ్చాయని వివరించారు.

మహిళల సాధికారత కోసం అంబేద్కర్ చేసిన కృషిని స్మరించుకుంటూ, మహిళలకు ఓటు హక్కు, విద్య హక్కు వంటి అనేక అవకాశాలను రాజ్యాంగం ద్వారా కల్పించిన ఘనత ఆయనదేనని చెప్పారు. లేబర్ చట్టాలు, ఎనిమిది గంటల పని విధానం, ప్రసూతి సెలవులు, హిందూ కోడ్ బిల్ వంటి కీలక సంస్కరణలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి సమాన ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలపరిచారని తెలిపారు.దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆలోచనలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని స్పష్టం చేశారు.

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే మహిళా బిల్లుపై స్పష్టత లేకపోవడం విచారకరమని పేర్కొంటూ, ప్రజల పక్షాన నిలిచే విధానాలే అమల్లోకి రావాలని అన్నారు. చదువు ద్వారా మాత్రమే వ్యక్తి చీకటి నుంచి వెలుగులోకి వస్తాడని, విద్యనే జీవితాలను మార్చే శక్తిగా భావించాలని సూచించారు. ఓటు హక్కు ద్వారా ప్రజలు తమ పరిపాలనలో భాగస్వాములు అవుతారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి చెందాలి

**కాప్రా, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని సాయి నగర్, పద్మశాలి టౌన్‌షిప్ ప్రాంతాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు సమాజ సేవలో ముందుండాలని సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ చేసిన కృషి అపారమని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు లభిస్తున్న రిజర్వేషన్లు అంబేద్కర్ దూరదృష్టి ఫలితమని పేర్కొన్నారు.



మీర్పేట్ హెచ్ బి కాలనీ

దళితులు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘం మేడ్చల్ జిల్లా కోశాధికారి బర్ల భిక్షపతి ముదిరాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జోగరావు, సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు రాజు, నవీన్ గౌడ్, గజేందర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాల మిత్ర సంఘం ఆధ్వర్యంలో మీర్పేట్ హెచ్ బి కాలనీ మదర్ డెయిరీ పార్క్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ ప్రసంగాలు చేపట్టారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి ఈసిల్ చౌరస్తాలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు ఘటించారు.ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ శాఖ అధికారులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ పాల్గొన్న వారితో రోడ్డు భద్రత ప్రమాణం చేయించారు .ఈ కార్యక్రమం లో మహా మాల మిత్ర సంఘం కమిటీ సభ్యులు అధ్యక్షుడు నరేందర్ కుమార్, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్, ఖజాంచి జగదీశ్వర్ రావు, సలహాదారు శ్రీనివాస్ జెతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, న్యాయం, సోదరభావం పెంపొందించేందుకు డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనతోనే సమాజంలో నిజమైన సమానత్వం సాధ్యం

- **విద్య ఫౌండేషన్ వార్షికోత్సవంలో ఎంపీ కడియం కావ్య**

**హన్మకొండ,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):**

లష్కర్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులకు, సామాజిక వేత్తలకు పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనతోనే సమాజంలో నిజమైన సమానత్వం సాధ్యమని పేర్కొన్నారు.మహిళల ఆర్థిక సాధికారత దేశ అభివృద్ధికి మూలస్తంభమని తెలిపారు. బాలికలు విద్యతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని, మహిళ బలపడితేనే కుటుంబం, సమాజం, దేశం బలపడుతుందని స్పష్టం చేశారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సమర్థంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.




అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను దేశానికి అందించిన మహనీయుడని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచనలు దేశవ్యాప్తంగా విస్తరించి ప్రజల్లో చైతన్యం పెంచాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, సామాజిక విభజనకు దారి తీసే విధానాలు అమలవుతున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గాల హక్కులను పరిమితం చేసే చర్యలు, మత స్వేచ్ఛపై ఆంక్షలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మత మార్పిడి చేసుకునే ఎస్సీల హక్కులను కుదించే విధానాలు రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు.

మహిళా బిల్లులపై స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని, మహిళల హక్కుల విషయంలో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. ట్రాన్స్‌జెండర్ హక్కుల విషయంలో కూడా వివక్షత కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిమితం చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సమాజ సేవా భావనను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్య ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలు

**ఘనంగా అన్నదానం నిర్వహణ**

**నాచారం/కాప్రా, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు నాచారం ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. నాచారం అంబేద్కర్ విగ్రహం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయనతో పాటు మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో మాట్లాడిన పరమేశ్వర్ రెడ్డి, అంబేద్కర్ ఆలోచనలు ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు. జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించడం ద్వారా సేవాభావాన్ని చాటిన సంతోష్‌రెడ్డిని అభినందించారు.సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ, మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా భారత సైన్యంలో సేవలందించి వచ్చినవాడినని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాచారం అంబేద్కర్ విగ్రహం కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**కాప్రా డివిజన్**

కాప్రా గాంధీనగర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ పి. రాజీవ్ అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వం పై ప్రేరణాత్మక ఉపన్యాసం చేశారు. అనంతరం కాప్రా గాంధీనగర్ నుండి ఈసీఐఎల్ క్రాస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ అనంతరం గాంధీనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో కాప్రా గాంధీనగర్ వెల్ఫేర్ మరియు యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. మహేష్, జి. సత్యనారాయణ, జి. బాలయ్య, జి. కిష్టయ్య, దామోదర్ చారి, తన్నీరు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, జిల్లా నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, లోక్ సత్తా మరియు సీపీఎం నాయకులు కూడా హాజరయ్యారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# తెలంగాణ భవన్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి

**న్యూ ఢిల్లీ, ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు పాల్గొని అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేశారు. పార్లమెంట్ సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్ మాట్లాడుతూ, సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యతపై అంబేద్కర్ చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు రవీంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్, ప్రధాన కార్యదర్శులు నారాయణ నాయక్, బస్కి నాయక్, భీముడు నాయక్, హరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.





# టీఎంజేఫ్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**హన్మకొండ, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎంజేఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, జిల్లా అధ్యక్షుడు సందేల రాజు, ప్రధాన కార్యదర్శి హన్మకొండ శ్రీకాంత్, జిల్లా నాయకులు శ్రీనివాస్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం రాష్ట్ర నాయకులు బొల్లెపాక రాజేష్, పెండ్యాల సుమన్ మాట్లాడుతూ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల సాధనలో ఆయన చూపిన దారి నేటికీ ప్రాసంగికమని తెలిపారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని సూచించారు. సమాజంలో సమానత్వం స్థాపించాలంటే అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని, యువత ఆయన సిద్ధాంతాలను అధ్యయనం చేసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మండలంలోని గ్రామాల్లో అంబేద్కర్ ఆశయాల జ్యోతి

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు జిలుగుల, జగన్నాథ్‌పూర్ తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు పండుగ వాతావరణంలో కొనసాగాయి. గ్రామాల వారీగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ ఆశయాలను కొనియాడుతూ సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.




మండల కేంద్రంలోని కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ పులి రమేష్, ఎస్‌హెచ్‌ఓ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మునిగడ లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ పులి రమేష్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఇదిలా ఉండగా, గోపాలపురం గ్రామంలో కూడా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆట పాటలతో యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం సర్పంచ్ కర్రె లక్ష్మీ బిక్షపతి, ఉప సర్పంచ్ సందీప్, వార్డ్ సభ్యులు, యూత్ క్లబ్ సభ్యులు, కుల ప్రముఖులు పాల్గొన్నారు. ఎస్‌హెచ్‌ఓ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఆయన ఎదుర్కొన్న కష్టాలను జయించి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. అనంతరం పోలీసు సిబ్బందితో కలిసి జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువత, బహుజనవాదులు, అంబేద్కర్ వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా యువత డీజే సౌండ్స్, నీలిరంగు జెండాలతో ర్యాలీలు నిర్వహించి జయంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొత్తంగా ఎల్కతుర్తి మండలంలోని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఉత్సాహంగా, శ్రద్ధగా నిర్వహించబడుతూ అంబేద్కర్ ఆశయాల జ్యోతి ప్రజల్లో వెలిగించారు.



# అంబేద్కర్ ఆశయాలే సమాన సమాజానికి దారి

**వరంగల్,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లా సంగెం మండలం పెద్ద తండ గ్రామ పంచాయతీలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగ శిల్పి, సామాజిక న్యాయానికి ప్రతీక, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగులోత్ వినోద్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ, పేదరికం నుంచి ప్రారంభమైన అంబేద్కర్ జీవితం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అనేక అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ చదువును ఆయుధంగా చేసుకుని దేశానికి రాజ్యాంగాన్ని అందించి సమానత్వం సాధించిన మహానుభావుడని తెలిపారు.

ప్రస్తుతం దేశంలో ప్రతి పౌరుడికి ఉన్న హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, ఓటు హక్కు అన్నీ అంబేద్కర్ పోరాట ఫలితమేనని వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు గౌరవం, మహిళలకు హక్కులు, ప్రతి మనిషికి సమాన అవకాశాలు కల్పించాలన్న ఆయన ఆశయాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు.“ శిక్షణ పొందండి, సంఘటితమవండి, పోరాడండి” అనే సందేశం ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చగల శక్తి కలిగినదని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను కేవలం స్మరించుకోవడం కాకుండా ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, సమానత్వాన్ని కాపాడుతూ, న్యాయం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# రానున్న రోజుల్లో రాజాసింగ్‌కు తగిన బుద్ధి చెబుతాం

- **డాక్టర్ పిడమర్తి రవి,ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్**



**హైదరాబాద్,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో వివిధ కులాల మధ్య వర్గాల మధ్య విభేదాలు సృష్టిస్తున్న మనువాది రాజాసింగ్ కు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు.మంగళవారం హైదరాబాద్ లోని జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్బండ్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు బ్లూ గ్రీన్ బ్లాక్ కవాతు నిర్వహించారు ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ రాజాసింగ్ మరియు ఇతర బిజెపి నేతలు దళితులపై వారి ఆహారపు అలవాట్లపై అనేక సందర్భాల్లో విద్వేషపూరిత ఆరోపణలు చేస్తూ ఎస్సి,ఎస్టి,బిసి,మైనార్టీల మనోభావాలు దెబ్బ తినే విధంగా మాట్లాడుతున్నారని అలాంటి వారికి రానున్న రోజుల్లో ఈ సమాజం తగిన బుద్ధి చెబుతుందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ లకు 20% ఎస్టీలకు 12 శాతం ముస్లింలకు 12 శాతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కొరకు ఉద్యమిస్తామని అన్నారు ఈ సందర్భంగా మరో అతికి మూఢనమ్మకాల నిర్మూలన సమితి రాష్ట్ర అధ్యక్షులు బైరి నరేష్ మాట్లాడుతూ పూలే అంబేద్కర్ కెరియర్ కాన్షీరామ్ వారసులు ఒక వేదిక పైకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు భారత రాజ్యాంగాన్ని పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెర్రీ పోతుల సాయన్న, బుదల బాబురావు,బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, శ్రీనాథ్ వడ్డెర నక్క మహేష్, అంకపాక సంపత్, మొగిలిగిద్ద ప్రసాద్, కే రామకృష్ణ,ఉద్యోగు గణేష్ మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కరుణాపురంలో ఘనంగా అంబేద్కర్ జయంతి

**ధర్మసాగర్,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు, ఎస్సైలు దిలీప్, రవీంద్రచారి హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం సీఐ శ్రీధర్ రావు మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. సమాజంలో సమానత్వం, న్యాయం, విద్య ప్రాముఖ్యతపై ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన సీఐ

వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ తో కలిసి సీఐ శ్రీధర్ రావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకారపు అనిల్ కుమార్,మాజీ సర్పంచ్ కలకోటి అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ సిక వసంత రవి,తదితర ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెంకటాద్రిపేటలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**చిల్పూర్,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** జనగాం జిల్లా చిల్పూర్ మండలం వెంకటాద్రిపేట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ సూచనల మేరకు ఎస్సి మోర్చా మండల అధ్యక్షుడు కందుకూరు రజినీకార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు నాయకులు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ చిల్పూర్ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తి చిరస్మరణీయమని, నేటి యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహనీయుడిగా అంబేద్కర్ నిలిచారని పేర్కొన్నారు. పీడిత ప్రజల పక్షాన పోరాడిన విశ్వమానవుడిగా ఆయనను కొనియాడారు. భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసిన మహా మేధావిగా అంబేద్కర్ సేవలను గుర్తు చేశారు.

అంబేద్కర్ బోధనలు, ఆశయాలు, విలువలను భావితరాలకు స్ఫూర్తిగా తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైన ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఊరటి రాజు ముదిరాజ్, ముక్కెర రమేష్ యాదవ్, మండల నాయకులు వాళ్ళ బోజు బ్రాహ్మచారి, ఆవుల సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వేలేరు మండల వ్యాప్తంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



**వేలేరు, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా వేలేరు మండల వ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామాలన్నింటిలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ గారి సమానత్వం, సామాజిక న్యాయం, విద్యకు ప్రాధాన్యత వంటి సిద్ధాంతాలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. పలు గ్రామాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించడంతో పాటు పేదలకు అన్నదానం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. దేశవ్యాప్తంగా కూడా అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తూ ఆయన సేవలను స్మరించుకుంటున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# వెల్టూర్ లో అంబేద్కర్ జయంతి సందర్భంగా భారీ యువత ర్యాలీ



**పెద్దమందడి,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి తో కలిసి గ్రామ సర్పంచ్ అశోక్ జెండా ఊపి ప్రారంభించారు.గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన ఈ ర్యాలీలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ చిత్రపటాలతో నినాదాలు చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ దేశానికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.విద్య, చైతన్యం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని, యువత అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# జవహర్ నగర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు



**జవహర్ నగర్, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. “జై భీమ్”, “జోహార్ అంబేద్కర్” నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం గొప్పదని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన రూపొందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల్ సురేందర్, ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరశురాములు, వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ చింతల విజయ్ కుమార్, జినుక రఘు తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ డిపోలో ..

కుషాయిగూడ డిపోలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, దేశ సమాజ నిర్మాణాన్ని మార్చిన మహనీయుడని అన్నారు. విద్య, పట్టుదలతో ఎన్నో కష్టాలను ఎదుర్కొని ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసించి, భారత రాజ్యాంగాన్ని న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలపై నిర్మించిన మహోన్నత వ్యక్తిగా నిలిచారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, రవికిరణ్, నర్సింగ్ రావు, కౌసల్య, రోజా, షర్మిల, మంజు వాణి, వనిత, ప్రెసిడెంట్ చక్రం మోహన్, ఎస్సీ ఎస్టీ సెక్రటరీ పండరి, రామకృష్ణ, సుగుణాకర్, దయానంద్, రాజు, బీసీ గౌరవ అధ్యక్షుడు గడ్డం యాదగిరి, బీసీ సంఘ అధ్యక్షుడు ఉపేందర్, వి. సురేందర్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్లు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# చేర్యాల్ లక్ష్మీ నృసింహ స్వామికి పట్టు వస్త్రాల అందజేత



◆ హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కందాడి హన్మంత్ రెడ్డి

**కీసర, ఏప్రిల్ 14 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కీసర మండలం రాంపల్లి దాయర (వెంకులోనిగుట్ట)లో వెలసిన హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రతినిధులు చేర్యాల్ శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ కందాడి హన్మంత్ రెడ్డి నేతృత్వంలో ట్రస్ట్ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలను అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు.దేవాలయాల మధ్య ఆధ్యాత్మిక, ధార్మిక అనుబంధాన్ని బలోపేతం చేయడం, సమాజంలో భక్తి భావనను పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.భక్తుల శ్రేయస్సు కోసం స్వామి వారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# బాబాసాహెబ్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి



మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 14(తెలంగాణ ముచ్చట్లు ):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కల్లూరు మండల కేంద్రంలోని మెయిన్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే నేడు అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ , జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కరెంటోల్ల సమ్మె కాంగ్రెస్ సర్కార్‌కి షాక్ ఇవ్వడం ఖాయం



◆ జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆర్టిజన్ల సమ్మె శిబిరానికి రావాలి
◆ కరెంట్ ఉద్యోగులు తలుచుకుంటే మీ ప్రభుత్వానికి షాక్ ఇచ్చి కూల్చుతారు
◆ ఏనుగుల రాకేష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు

**హన్మకొండ,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** కరెంటోల్ల సమ్మె కాంగ్రెస్ సర్కార్ షాక్ ఇవ్వడం ఖాయం అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. మంగళవారం

హన్మకొండ ములుగు రోడ్డులోని ట్రాన్స్కో కార్యాలయం ముందు విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ట్రాన్స్కో, జెన్కో, టీజీఎన్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్, కేటీపీఎస్ వంటి సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంటెస్టెడ్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సెంటర్ వద్ద వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు తరువాత ఉద్యోగులకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకున్నట్టు గుర్తు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థను తగ్గిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. విద్యుత్ రంగంలో వేలాది కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిసన్‌లుగా గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేపట్టాలని, సేవా నిబంధనలను అమలు చేయాలని కోరారు. టీజీఎన్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిసన్‌లుగా విలీనం చేయాలని సూచించారు. అలాగే, నిర్దిష్ట తేదీకి ముందు అర్హతలు సాధించినప్పటికీ ఔట్‌సోర్సింగ్ విధానంలో కొనసాగుతున్న కార్మికులను ఆర్టిసన్‌లుగా గుర్తించాలని కోరారు. పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2026 వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కొనసాగితే విద్యుత్ రంగంలో ప్రభావం చూపే అవకాశం ఉందని, ప్రభుత్వం తక్షణం స్పందించాలని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో టివివిఏఈ జేఏసీ ట్రాన్స్కో కంపెనీ కన్వీనర్ కందికొండ వెంకటేష్, భరత్,ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ కన్వీనర్ రాజన్న,జనరల్ సెక్రెటరీ సునీల్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్ ,రాజేష్ నాయక్,సృజన,ఇందిర,శ్రీకాంత్,రమేష్,రజనీకాంత్,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

–చింతకాని ఎస్సై వీరేందర్

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు.. ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమంపై అవగాహన




**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ 14(తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయంగా చింతకాని పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలను (హాట్‌స్పాట్స్) గుర్తించి, అక్కడ వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు. ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పందిళ్లపల్లి, రామకిష్టపురం వద్ద హెచ్చరిక బోర్డులను అమర్చారు.

మలుపుల వద్ద రోడ్డు స్పష్టంగా కనిపించేలా, రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల పొదలను ఇప్పటికే తొలగించారు.

ఇతర శాఖల సమన్వయంతో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చడం, చెత్తాచెదారాన్ని క్లియర్ చేయడం వంటి పనులను వేగవంతం చేశారు.

'అరైవ్ అలైవ్' - కుటుంబాల భద్రతే ముఖ్యం ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమంలో భాగంగా ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంట్లోని మహిళలు తమ భర్తలు, కుమారులు బయటకు వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, క్షేమంగా తిరిగి రావాలని గుర్తు చేయాలని ఆయన కోరారు. రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణ నష్టాన్ని నివారించగలమని, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# నారాయణపురంలో ఆధ్యాత్మిక ప్రభ..



◆ హనుమత్ నామస్మరణతో పులకించిన మంత్రి పొంగులేటి నివాసం

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 14(తెలంగాణ ముచ్చట్లు):** భక్తిశ్రద్ధలు... ఆధ్యాత్మిక పరిమళాల మధ్య కల్లూరు మండలం నారాయణపురం గ్రామం పులకించిపోయింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్వగృహంలో హనుమాన్ చాలీసా పారాయణ ఘట్టం అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ సాగింది. మంగళవారం నాటి పవిత్ర ఘడియల్లో ఆంజనేయ స్వామి స్తోత్ర పారాయణంతో మంత్రి నివాసం ఆధ్యాత్మిక వేదికను తలపించింది.

కుటుంబ సమేతంగా ఆధ్యాత్మిక ఆరాధన...

ఈ పవిత్ర కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయన సతీమణి పొంగులేటి మాధురి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మాతృమూర్తి పొంగులేటి స్వరాజ్యం సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి శ్రీలక్ష్మి రెడ్డి దంపతులు భక్తితో పారాయణం చేశారు. కుటుంబ సభ్యులందరూ ఏకమై సామూహికంగా హనుమాన్ చాలీసా పఠిస్తుంటే ఆ ప్రాంతమంతా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరుతూ..

కేవలం ఆధ్యాత్మిక సాధనకే కాకుండా, లోక కళ్యాణార్థం, రాష్ట్ర ప్రజలందరి క్షేమం కోరుతూ ఈ పారాయణాన్ని నిర్వహించారు. "రామదూత" ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# ఎం.ఎ. రషీద్‌కు 'డాక్టరేట్'




◆ ఘనంగా సన్మానించిన తుంబూరి దయాకర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో , ఏప్రిల్ 14(తెలంగాణ ముచ్చట్లు ):** నగరంలోని 38వ డివిజన్‌కు చెందిన ఎం.ఎ. రషీద్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పొందిన సందర్భంగా, లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

మంగళవారం ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రషీద్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.

సమాజ సేవలో లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆదర్శం: దయాకర్ రెడ్డి

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత చదువుల్లో రాణించి డాక్టరేట్ సాధించడం అభినందనీయమని రషీద్‌ను కొనియాడారు. అలాగే, సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న లైఫ్ లైన్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు తుంబూరి దయాకర్ రెడ్డిని కూడా గౌరవపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీమియాతో పాటు షేక్ హసన్, షేక్ నజీరుద్దీన్, షేక్ బాబు సాహెబ్, షేక్ చందుపాషా, షేక్ అమీర్, ఖలీల్, ఇమామ్, కృష్ణమూర్తి, రహీం, జుల్ఫికర్ అలీ, శంషుద్దీన్, అహ్మద్ మరియు ఇతర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించిన దార్శనికుడు అంబేద్కర్

**హన్మకొండ,ఏప్రిల్14(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ సర్కిల్‌లోని విగ్రహానికి పూలమాలలు సమర్పించి ట్రైబల్ జర్నలిస్టులు గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక అసమానతలు, అంటరానితనంపై నిరంతరం పోరాడిన మహాయోధుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. స్వాతంత్ర్య భారతదేశానికి ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అందించి, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించిన దార్శనికుడు అంబేద్కర్ అని వివరించారు. విద్య, సంఘటితం, ఉద్యమించు అనే సందేశంతో బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం నింపిన నాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు. న్యాయశాస్త్రంలో ప్రావీణ్యం, ఆర్థిక రంగంలో విశేష దృష్టి, రాజకీయం, సామాజిక సంస్కరణలలో అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి



అని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సమానత్వం కలిగిన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా యువత ఆయన జీవితం, రచనలను అధ్యయనం చేసి ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. కుల, మత, లింగ వివక్షలు లేని సమాజాన్ని నిర్మించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో లావుడియా పల్లవి రాజు నాయక్, రామన్న నాయక్, శ్రావణ్ కుమార్, వెంకట్, వీరన్న నాయక్, అజ్మీర వెంకట్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in